# ఏక్సిడెంట్



ఉత్పలవరదరాజు

వాలుగా వస్తూన్న గాలిదుమారం—

రిక్షా తొక్కకుండానే దూసుకు పోతోంది. సినిమా అయిపోవడంతో ఆదివారం రోజు హాయిగా రిక్షాలో కూర్చొని ఇంటికి వస్తున్నాను.

రిక్షావాడు బ్రేకులు అప్పుడప్పుడు నొక్కి ఒక్కొక్కసారి తొక్కుతున్నాడు. రోడ్డు మలుపు....

హఠాత్తుగా ఓ యువతి రోడ్డుకు అడ్డుగా వచ్చింది.

రిక్షావాడు లాఘవంగా బ్రేక్ వేసి చటుక్కున తిప్పాడు. నేను ముందుకు తూలాను.

రిక్షా హ్యాండిల్ తగలడంతో ఆ అమ్మాయి తూలిపడింది. కాలు, వేళ్ళ మీదుగా వెనుక చక్రం ఎక్కింది.

రిక్షావాడు చటుక్కున ఆపాడు.

"దెబ్బలేం తగల్లేదులే పోనివ్.. " రిక్షావాడ్ని కసిరాను

రిక్షావాడు నా మాటలేం విన్పించుకోకుండా ఆ అమ్మాయి జబ్బపట్టుకొని ప్రక్కకు నడిపించాడు.

దీనంగా, బాధగా కాలును సవరదీసుకొంటున్న ఆమెకు రిక్షావాడు రెండ్రూపాయిలిచ్చాడు.

నాకు చిరాకేసింది.

ఈ మాత్రానికే రెండురూపాయలా!

ఆమె వచ్చినదారిన వెళ్ళిపోసాగింది. రిక్షా ముందుకు కదిలింది.

నేను మౌనంగా వుండలేకపోయాను. ఇలా చిన్న దెబ్బలకు డబ్బులు అలవాటు చేస్తే రేపు ఇదే వృత్తిలో బ్రతకడం అలవాటుచేసుకుంటారు.

రిక్షావాడు మాట్లాడలేదు.

డబ్బులు ఇచ్చినందుకు వాడ్ని మెచ్చుకోలేకపోయాను. వాడు బదులు చెబితే కసితీరా తిట్టివుండేవాణ్ని.

"అసలు ఆ వయస్సులో పిల్లలకు నెత్తిన కళ్ళుంటాయ్. ఏ మగాడ్ని ఎలా చూడాలా అని ఆలోచిస్తుంటారు" అన్నాను

అయినా రిక్షావాడు మాట్లాడలేదు.

మా ఇల్లు రానే వచ్చింది. రిక్షా మా ఇంటిముందు ఆగడ తో మాట్లాడిన విధంగా డబ్బులు రిక్షావాడి చేతిలో పెట్టాను

రిక్షావాడు ఏదోలా చూసి "ఇందాక రిక్షాక్రింద పడ్డమ్మాయి నా కూతురండీ!" అన్నాడు. అంతే!

నాకు మతిపోయినంత పనయింది